మీ నిదానంలో మీరు ఉంటూ, ఉద్రేకపడకుండా నిర్మలంగా ఉంటూ, ఏది వచ్చినా ఇది భగవంతుడి ప్రసాదమే అనుకొంటూ, మీ పని ఏదో మీరు ప్రశాంతంగా చేసుకొంటూ వెడితే భగవదనుభవం పొందటానికి మీకు అడ్డువచ్చే విషయాలు అన్నీ భగవదనుగ్రహం వలన అన్నీ పోతాయి. పనిచేసేటప్పుడు శ్రద్ధగా చేయండి. మాట్లాడేటప్పుడు శ్రద్ధగా మాట్లాడండి, అది లోకానికి సంబంధించిన విషయం అయినా సరే అశ్రద్ధపనికిరాదు. అప్పుడు కూడా భగవంతుని దయ మీకు కలుగుతుంది. మాటలో పొందిక ఉండాలి మాట దేవుడితో సమానం కాబట్టి మాటల విషయంలో జాగ్రత్తగా ఉండండి. భగవంతుడు ఎక్కడో ఉన్నాడుఅనుకోవద్దు, నీలోపల ఉన్నాడు, నీకూడా ఉన్నాడు, నీ శరీరం మరణించిన తరువాత నీకూడా వస్తాడు. భగవంతుడే మనకు నిజమైన గురువు, ఆయనే మనకు నిజమైన సహచరుడు, నిన్ను ఒక్కక్షణం కూడా ఆయనవిడచిపెట్టడు, కాని ఆయనను అనుభవంలోనికి తెచ్చుకోవడానికి ఒక్కక్షణం కూడా మనం ప్రయత్నం చేయటం లేదు, కాలాన్ని వృధా చేసుకొంటున్నాము. చేతులతో పనిచేసుకోండి, మన మనస్సును భగవంతుని మీద పెట్టండి, మమకారం తగ్గించుకోండి. మమకారం తగ్గించుకొంటే మీ మనస్సు భగవంతుని వైపు తిరుగుతుంది. మీరు తొందరపడవద్దు, భగవంతుని సహకారం వస్తుంది, మీ బాధ్యతలను ఆయన మోస్తాడు. ఏదిక్కులేని వారికి దేవుడే దిక్కు. భగవంతుడే మనకు నిజమైన చుట్టం, ఆయనే మనకు నిజమైన ఆస్తి. ఆయన నిరంతరం నీకూడా ఉంటాడు. నీ జాగ్రదవస్థలో, స్వప్నావస్థలో, గాఢనిద్రలో కూడా ఆయన నీ హృదయంలో ఉన్నాడు. అట్టి భగవంతుడిని తెలుసుకోవటం మానివేసి ఎందుకు కాలాన్ని పాడుచేసుకుంటావు. అక్కరలేని గొడవలలోనికి వెళ్ళవద్దు. మీ పని ఏదో మీరు చేసుకొంటూ భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేసుకోండి. ఒక్కమాట మీరు బాగాగుర్తుపెట్టుకోండి. జ్ఞానం అంతా మౌనంలోనే ఉంది. దక్షిణామూర్తి మౌనంలోనే బోధించాడు. మాటలు చెప్పలేనిది, తలంపులు చెప్పలేనిది మౌనం బోధిస్తుంది. ఆత్మతత్వాన్ని మౌనం చెప్పినంత సమగ్రంగా మాటలు, తలంపులు చెప్పలేవు. మౌనం జ్ఞానాన్ని పట్టిఇస్తుంది. అంతే కాదు జ్ఞానమంతా మౌనంలోనే ఉంది. అసలు మాట్లాడవద్దనికాదు, ఎక్కువగా మౌనాన్ని ప్రాక్టీసు చేయండి. భగవంతుని పాదాలను ఆశ్రయించండి, ఆయనను అనుభవంలోనికి తెచ్చుకోండి, మన జీవితలక్ష్యం అదే. రామకృష్ణుడు ఏమి చెప్పాడుఅంటే ఒక మంచి మామిడిచెట్టు ఉంది అనుకోండి, దానికి పళ్ళువేలాడుతూ ఉన్నాయి అనుకోండి. దానిని చూసి మనం ఏమనుకొంటాము ఆ చెట్టు ఎంత బాగుంది, ఎంత బాగా కాసింది, పళ్ళు ఎంత అందంగా ఉన్నాయి అనుకొంటాము. అలాగే పరబ్రహ్మం ఒక వృక్షం లాంటివాడు. ఋషులు, యోగులు, మహాత్ములు ఆ మహావృక్షానికి కాసిన పళ్ళు లాంటివారు అని చెప్పాడు. జ్ఞానపూరితమైన మాట, కాంతిపూరితమైన మాట, శాంతిని కలుగజేసే మాట ఏ మొఖంలోనుండి వచ్చినా మనం దానిని ఆస్వాదించాలి. అలా ఆస్వాదించలేకపోతే మన బుద్ధి పాడుబుద్ధి అని అర్థం.

**సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-02, పాతళ్ళమెరక**

**20-10-2002**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రూపదృష్టి, నామదృష్టి తగ్గించుకోమని మన పెద్దలు చెప్పారు. మన హృదయంలో ఉన్నవస్తువు మనకు తెలియకుండా ఈ రెండే మనకు అడ్డువస్తున్నాయి. మనకు తెలిసినా, తెలియకపోయినా మరణంలేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. అది తెలిస్తే మనకు సుఖం కలుగుతుంది, అమృతత్వం పొందుతాము. అతి తెలియకపోతే దుఃఖం, మృత్యువుకు గురవుతాము. రూపభావన, నామభావన వలననే మనకు అహంభావన పెరుగుతోంది. మనలో ఉన్న చైతన్యం గుర్తింపులు కోరదు ఎందుచేతనంటే దానికి ఇతరులు లేరు. అహంభావనకు ఇతరులు ఉన్నారు. అహంభావనను కేంద్రంగాపెట్టుకొని జీవిస్తున్నంతకాలం గుర్తింపులు కోరకుండా ఉండలేము. సాధన పేరు చెప్పి అహంభావనను తొలగించుకోవాలి గాని అహంభావనను పెంచుకోకూడదు. ఉన్నదేదో నీ హృదయంలో ఉంది. నీవు సాధన చేసి పోగొట్టుకోవలసింది దేహాత్మభావన ఒక్కటే, నీ సాధన యొక్క గమ్యం అదే. దేహబుద్ధి నశించిన మరుక్షణంలో నీకు శివబుద్ధి కలుగుతుంది. మన దైనందిన జీవితంలో మన మాటలోగాని, తలంపులోగాని, చేతలోగాని దేహభావన పెంచుకోకూడదు. వీటిద్వారా దేహభావన తగ్గించుకొంటూ రావాలి. పనిలోదేవుడుని చూడాలి. లోకం గుర్తింపులకోసం మనం పని చేస్తే పదిమంది మనకు జైకొట్టవచ్చుగాని ఈశ్వరానుగ్రహానికి పాత్రులంకాలేము. మనకు మోక్షం ఇచ్చేవాడు ఈశ్వరుడే గాని లోకంకాదు. అందుచేత మనం ఏపని చేసినా ఈశ్వరానుగ్రహం పొందాలి అని దృష్టిలోపెట్టుకొని చేయాలి. మనకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండటం వలన ఆధ్యాత్మిక అభివృద్ధిలో వెనుకబడుతున్నాము. అన్ని నియమములోనికి ఆహార నియమం ఉత్తమమైనది. అందుచేత ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. నీకు హితమైనది మితంగా తినాలిగాని అతిగా తినకూడదు. శరీరం యొక్క అవసరాన్ని బట్టి తినాలి గాని రుచికోసం తినకూడదు. మన మాట సౌమ్యంగా ఉండాలి, హితువుగా ఉండాలి, ఇతరులను ఎడ్యుకేట్ చేసేదిగా ఉండాలి. మన మాట మనకు చల్లదనం కలుగజేయాలి. ఇతరులకు చల్లదనం కలుగచేయాలి. అందుచేత మాటల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనం అవసరంలేని మాటలు ఎక్కువగా మాట్లాడుతూ ఉంటాము. అవసరం లేకుండా మాట్లాడటం వలన మనకు తెలియకుండా అహంభావన పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు, వాడు హృదయం యొక్క లోయలలోనికి వెళ్లలేడు. ఒక మనిషి ఎంత చెడ్డవాడైనప్పటికి వాడిని ద్వేషించవద్దు. వాడిని ద్వేషిస్తే మనకు శాంతి పోతుంది, మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, మనం ధ్యానం చేయాలన్నా వాడి నామరూపములే జ్ఞాపకం వస్తాయి మన ధ్యానం చెడిపోతుంది. జీవుడు యొక్క సోర్సు ఏమిటి, ఎక్కడ నుండి ఉదయిస్తుంది అని దానిని విచారణలో పెట్టకుండా, అది ఉదయించిన తరువాత ఏ విషయాలు అయితే కల్పిస్తోందో ఆ విషయాల

**రమణ భాస్కర**

వెంట పరుగెడుతున్నావు ఇంక నీకు సత్యాన్వేషణ సాధ్యంకాదు. ఏ వస్తువును తెలుసుకొన్నాక ఇంక తెలుసుకోవలసినది ఏదీ మిగలదో ఆ వస్తువును తెలుసుకోవటం మీద నీ సాధనను గురిపెట్టటం లేదు. గుడిలో అభిషేకం చేస్తున్నారు. అభిషేకం అభిషేకం కోసమే ఎంతమంది చేస్తున్నారు? ఏదో వస్తుందని ఆశించి చేస్తున్నారు. అది నేరమని నేను చెప్పటంలేదు, దానివలన మనకు వ్యాపార మనస్తత్వం వచ్చేస్తుంది, మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. పనిపనికోసమే చెయ్యండి, ప్రేమ ప్రేమకోసమే భగవంతుడిని ప్రేమించండి. సహనాన్ని ప్రాక్టీసు చేస్తున్నారు అనుకోండి, లవ్‌ను ప్రాక్టీసు చేస్తున్నారు అనుకోండి వ్యక్తిభావన స్లోగా రెడ్యూస్ అయిపోయి అంటే నెమ్మదిగా పల్చబడి అదృశ్యమయిపోతుంది. మనం పనిని బ్రహ్మభావనతో చేయటంలేదు, దేహభావనతో చేస్తున్నాము బ్రాహ్మీస్థితిని పొందాలనుకొంటున్నాము, ఇలా సమన్వయం అసలు కుదరదు. నువ్వు బ్రాహ్మభావనతో పని చేస్తూ ఉంటే ఏదో రోజున బ్రాహ్మీస్థితిని పొందుతావు.

నాకు భగవంతుడిని తెలుసుకోవాలని ఉంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవంతుడు ఎప్పుడైనా వచ్చి ఆయనను తెలుసుకోమని అడిగాడా అంటున్నారు భగవాన్. ఆయన ఎప్పుడూ నన్ను అడగలేదు అని చెప్పాడు అయితే అ గొడవ నీకు ఎందుకు అన్నారు. నీకు కావలసింది భగవంతుడు కాదు, నీకు సుఖం కావాలి, శాంతి కావాలి, ఆనందం కావాలి దానికి భగవంతుడు అని పేరు పెట్టావు అంతే . లోపల ఉన్న వస్తువు ఉన్నది ఉన్నట్లుగా మనకువ్యక్తమయినప్పుడు మనకు ఎటుచూసినా సుఖమే, ఎటు చూసినా శాంతే. అప్పుడు దేహం ఉన్నా లేకపోయినా, లోకం కనిపించినా కనబడకపోయినా అసలు బేధం కనిపించదు. అక్కడ మన సాధనను గురిపెట్టాలి. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానిని నీవు లేదు లేదు అనుకొన్నా ఉన్నది లేకుండా పోదు. లేని దానిని నీవు ఉంది అనుకొన్నా అది లేదు. నువ్వు కాని దాని మీద నీ మనస్సును నిలబెట్టినా అది నువ్వు అవ్వవు. నువ్వు ఏదైతే అవునో దాని మీద నీమనస్సును నిలబెడితే అది నువ్వు అవుతావు, నీ మనస్సును అక్కడ నిలబెట్టి ఉంచటమే సాధన. నేను అందరి హృదయాలలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు, దానిని గ్రహించే శక్తి మనకు లేదు. ఎవరైనా ద్వేషిస్తూ ఉంటే భగవంతుడిని ద్వేషించినట్లే అవుతుంది, ఎవరికైనా అపకారం చేస్తే భగవంతుడికి అపకారం చేసినట్లు అవుతుంది ఎందుచేతనంటే అక్కడ లోపల ఈశ్వరుడు లేకుండా ఆదేహంరాదు. నేను మిమ్మల్ని స్మరించుకొంటున్నాను. స్మరించటం వలన నాకు ఏకాగ్రతరావాలి, పవిత్రతరావాలి. రమణారమణా అనేటప్పటికి నేను పవిత్రుడను అవ్వాలి, మనస్సు యొక్క చాపల్యం తగ్గాలి. నేను ఆధ్యాత్మికంగా పెద్ద బలవంతుడిని కాదు, మీ అనుగ్రహం కావాలి, మీ దగ్గరనుండి సహాయ సహకారములు అర్ధిస్తున్నాను అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. అగ్ని వేడిలేకుండా ఉండదు అలాగే చైతన్యం అనుగ్రహం లేకుండా ఉండదు. రమణారమణా అంటే అక్కడ చైతన్యమే. రమణుడిని ఒకరూపానికి, ఒక నామానికి పరిమితం చేయనక్కరలేదు. నన్ను స్మరించుకొంటున్నాను అని అంటున్నావు, దేని వలన స్మరించుకొంటున్నావు? నీలోపల చైతన్యం ఉంది. దాని అనుగ్రహం లేకుండా, దాని దయ లేకుండా నన్ను స్మరించుకొంటున్నావా? ఆ స్మరించుకోవటం కూడా నీ సొంతం కాదు. ఏ వస్తువునయితే నీవు తెలుసుకోవాలనుకొంటున్నావో ఆ వస్తువు యొక్క దయ వలననే ఆ వస్తువును స్మరిస్తున్నావు. నీ పేరు లక్ష్మి అనుకో. భగవంతుడికి భిన్నంగా లక్ష్మి ఉందా? భగవంతుడి కంటే వేరుగా లక్ష్మి ఉంది అనుకొంటే అది లక్ష్మి అవ్వదు. ఇది తెలుసుకొంటే జ్ఞానం తెలియకపోతే అజ్ఞానం. నేను మీ మనస్సులో ఉన్నదోషాలు చూడటం కాదు, నా మనస్సులో ఉన్న దోషాలు చూసుకొని వాటిని సవరించుకొంటే నాకు జ్ఞానోదయం అవుతుంది. మీరు ఎలా మాట్లాడుతున్నారు అనేది ముఖ్యంకాదు, నేను ఎలా మాట్లాడుతున్నాను అనేది నాకు ముఖ్యం ఎందుచేతనంటే నా మాట చేత తలంపు మీద నా ఆధ్యాత్మిక అభివృద్ధి ఆధారపడి ఉంది. నువ్వు రమణానుగ్రహం లేదనుకొంటావు ఏమిటి? రమణానుగ్రహం వలననే రమణా అనుకొంటున్నావు, అనుగ్రహం లేకపోతే నీ నోటి వెంట రమణా అనే మాట కూడా రాదు. అనుగ్రహం పనిచెయ్యనిక్షణం అంటూ ఉన్నదా? అనుగ్రహాన్ని నీవు అందుకోలేక పోతున్నావు. చైతన్యానికి మరొక పేరే అనుగ్రహం. అది ఎప్పడూ ఉంది. దానిని అందుకోవటానికి మనం అర్హులం అవ్వాలి. దానికి అర్హత, యోగ్యత సంపాదించాలి. అదే సాధన యొక్క ప్రయోజనం. ఈశ్వరానుగ్రహం నీమీద లేకపోతే ఆయన స్మరణే నీకు రాదు. ఎవరి దయవలన, ఎవరి అనుగ్రహం వలన ఆ స్మరణ వచ్చిందో ఆదయే నిన్ను గమ్యానికితీసుకొని వెళుతుంది. ఇందులో సందేహం అక్కరలేదు. ప్రతీ చిన్న విషయానికి సందేహించేవాడికి నోటిలో దుమ్ము పడుతుంది. ఈశ్వరుడిని నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము. ఈశ్వరానుగ్రహం నీమీద ఉంది కాబట్టే ఆయనను స్మరించుకొంటున్నావు. ఇంక నీకు ఆందోళన ఎందుకు? అంతా ఆయనే చూసుకొంటాడు. జీవితంలో నీకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతూ ఉంటాయి. నాకు ఇష్టంలేదు, ఈ సంఘటనలు ఇలా జరుగుతున్నాయి ఏమిటి అని నీవు అనుకొంటున్నావు. ఆ ఇష్టం లేని సంఘటన కూడా నీకు మంచి తీసుకొని రావచ్చు, అది నీకు తెలియదు. ఇష్టంలేని సంఘటనలు జరుగుతూంటే మనకు ఆందోళన వస్తుంది. మీరు ప్రతీ చిన్న విషయానికి ఆందోళన పడుతూ ఉంటే ఈశ్వరుడి అస్థిత్వం పట్ల మీకు నమ్మకంలేదు అని అర్థం. నోటితో ఈశ్వరుడు ఉన్నాడు అని చెప్పి, మీ మనస్సుతో వెక్కిరించవద్దు. మీ మనస్సు అశాంతికి గురిఅవుతూ ఉంటే మీకు ఈశ్వరుడి పట్ల విశ్వాసం లేదు అని అర్థం, మనస్సుతో వెక్కిరించటం అది. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. ఆయనను పొందటానికి మనకు ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. మనం ప్రేమించవలసింది భగవంతుడిని, సైతానును కాదు. మనకు సైతాన్ మీద ఉన్న విశ్వాసం కూడా

భగవంతుడి మీద లేదు. ఇతరులను పీడించటం ఎంత దోషమో నీ మనస్సుని నీవు పీడించుకోవటం కూడా అంతేదోషం. నిరంతరం ఏదో కల్పించుకొంటూ, ఊహించుకొంటూ బాధపడిపోతూ ఉంటారు, అది మంచిదికాదు. మనిషికీ మనిషికీ ఉన్న సంబంధం కేవలం అహంభావనమీద ఆధారపడి ఉంటుంది. మనకు నిజమైన బంధువు ఈశ్వరుడు ఒక్కడే. మరణానంతర జీవితంలో మనకూడా వచ్చేవాడు ఈశ్వరుడు ఒక్కడే. భగవంతుడి నామానికి ఎంత శక్తి ఉంది అంటే మీ యొక్క బలహీనతలను బట్టి మీరు నరకానికి వెళ్ళినా మీరు చేస్తున్న నామం నరకంలోనుండి మిమ్మల్ని విడుదలచేసి స్వర్గానికి తీసుకొని వస్తుంది అని శివానంద చెప్పారు. నామానికి అంతశక్తి ఉంది కాబట్టి నామం విషయంలో మీరు అశ్రద్ధగా ఉండవద్దు. యజ్ఞాలలో జపయజ్ఞః౦ నేను అని కృష్ణుడు చెప్పాడు. అయితే మీరు నామం చేసేటప్పుడు ఆ నామం పట్ల మీకు ప్రేమ ఉండాలి, గౌరవం ఉండాలి, సజీవమైన విశ్వాసం ఉండాలి.

బయట సహాయం లేకుండా నా అంతట నేను కృషి చేసుకొంటూ లోపల ఉన్న సత్యాన్ని గ్రహించగలనా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నారు. అసలు నీకు సత్యాన్ని గ్రహించాలి, సత్యానుభవం పొందాలి అనే తలంపు రావటమే ఈశ్వరుని దయ. ఆయన అనుగ్రహం లేకపోతే సత్యాన్వేషణ బుద్దే నీకు కలుగదు. ఆయన అనుకొన్నాకే నీవు అనుకొంటున్నావు. అసలు నువ్వు అంటూ లేనేలేవు, అంతా ఆయనే. ఆయన అనుగ్రహం వలననే నీకు కదలికవచ్చింది. నీకు ముముక్షత్వం వచ్చింది అంటే అది ఆయన అనుగ్రహం వలననే వచ్చింది గాని లేకపోతే రాదు. ఇది మనకు అర్థంకావటంలేదు. భగవంతుడు అంతర్యామిగా లేకుండా ఏ దేహం ఈ భూమి మీదకురాదు. ఆయన కంటే మనం ఏదో భిన్నంగా ఉన్నాము అనుకొంటే అది మన అహంభావన. సత్యానుభవం పొందటానికే మనం ఈ భూమిమీదకువచ్చాము. కేవలం అన్నంతినటానికి, బట్టలు కట్టుకోవటానికి రాలేదు. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను ధనం ఇచ్చినా, విద్య ఇచ్చినా, తెలివి ఇచ్చినా, మీకు ఏ గిఫ్ట్ ఇచ్చినా దానిని భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకోవాలి. ఒక అమెరికన్ సైంటిస్టు ఏమి చెప్పాడు అంటే నేను సౌత్ ఇండియాలో ఒక ఋషిని చూసాను అప్పటివరకు జీవిత యాత్ర స్మశానంతో ముగిసిపోతుంది అనుకునేవాడిని కాని ఆ ఋషిని చూసిన తరువాత నాకు ఒకటి తెలిసింది. ఈ దేహంతోటి సంబంధం లేకుండా ఈ దేహానికి అతీతంగా పంచభూతాలకు అతీతంగా, జరుగుతున్న సంఘటనలకు అతీతంగా ఏదో ఉందని లోపల నాకు స్ఫురించింది. అంతేకాదు అది నాకు తెలియటంలేదు అన్నసంగతి కూడా నాకు తెలిసింది. ఏదో ఉందని స్ఫురించటం ఆ మహర్షి దర్శనం వలన కలిగింది. అప్పటినుండి సత్యాన్వేషణ ప్రారంభమయింది. సత్పురుషుల సాంగత్యం అటువంటిది అని ఆ సైంటిస్టు చెప్పాడు. అందుచేత కృషి అవసరమే, కృప అవసరమే, నీ కృషిని కాపాడుకోవటానికే సత్పురుషుల సహవాసం. వినయం విడిచిపెట్టవద్దు. ఎట్టిపరిస్థితులలోను నీ మొఖంలో అవినయం రాకుండా చూసుకో. అహంభావనను కేంద్రంగా పెట్టుకొని జీవించేవాడు భౌతిక సంపదకు కూడా దూరమవుతాడు, వాడు ఇహానికి చెడతాడు. పరానికి చెడతాడు. ఎవరైనా మంచిపనులుచేస్తే చూసి సంతోషించాలి. మంచిచూసి సంతోషించలేకపోతే మానసిక దారిద్ర్యం ఉన్నట్లు గుర్తు. మనకు భౌతికంగా దారిద్ర్యం ఉండవచ్చు గాని మానసికదారిద్ర్యం ఉన్నవాడు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందలేడు.

భగవంతుడు గీతలో ద్రవ్యయజ్ఞం, జపయజ్ఞం, జ్ఞానయజ్ఞం అని ఇలా చాలా యజ్ఞాల గురించి చెప్పాడు. ఈ యజ్ఞాల వలన మన మనస్సు నియమింపబడుతుంది, మనకు పుణ్యబలం పెరుగుతుంది, మన మనస్సు నిగ్రహింపబడుతుంది, నిగ్రహింపబడిన మనస్సుకే అంతర్‌దృష్టి కలుగుతుంది, అంతర్‌దృష్టి కలిగిన మనస్సుకే ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనం ఏపని చేసినా యజ్ఞభావంతో చేయాలి. ఎవరికైనా అన్నంపెడితే వాడు మనపట్ల కృతజ్ఞతగా ఉన్నాడా లేడా అని ముఖ్యంకాదు. లోపలతినేవాడు అంతర్యామి భగవంతుడు. అన్నం ఆయన, గరిటె ఆయన, అన్నంపెట్టేవాడు ఆయన, భుజించేవాడు ఆయన, అన్నీ ఆయనే, అదే యజ్ఞభావం. యజ్ఞభావంతో మనం పనిచేస్తే మనలో ఏమైనా దోషాలు ఉన్నా అవిపోతాయి, మనకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నేను ఏదైనా మంచిపని చేస్తూఉంటే దానిగురించి మీరు ఏమి మాట్లాడినా నాకు మీతో సంబంధంలేదు, అది నాకు ఈశ్వరుడికి సంబంధం ఎందుచేతనంటే మోక్షం ఇచ్చేవాడు ఈశ్వరుడే కాని మీరుకాదు. మీరు రాగద్వేషములు తగ్గించుకోవాలి. తలంపులు, మాటలు తగ్గించుకోవాలి. మన ఆరోగ్యం ఎలా చెకప్ చేసుకొంటామో అలాగ ఏరోజుకారోజు మనం మాట్లాడే మాటలు దేనివలన మాట్లాడుతున్నాము అని విచారణ చేసుకోవాలి. మనం అహంభావన వలన మాటలు మాట్లాడుతూ ఉంటే ఆ మాటలు తగ్గించుకోవాలి. నువ్వు సంపాదించవలసింది ఏమీలేదు, పోగొట్టుకోవలసిందే ఉంది. సత్యవస్తువు నీ హృదయంలోనే ఉంది, దానిని ప్రత్యేకించి నీవు సంపాదించనక్కరలేదు. అది అనుభవంలోనికి రాకుండా నీకు ఏ అటంకాలు వస్తున్నాయో చూచుకొని వాటిని తొలగించుకో. అదే సాధన. మీలోపల ఉన్న ఆనందసముద్రం పొంగి మీ సహస్రారాన్ని ముంచటం ప్రారంభించింది అనుకోండి మీకు అసలు ఊపిరాడదు. ఈ ఆనందం చాలు ఇంతకంటే ఎక్కువ ఆనందం వస్తే భరించలేము అని మీకు అనిపిస్తుంది. అట్టిది ఆ ఆనందం, అది అలౌకికమైనది, అభౌతికమైనది. అది ప్రపంచానికి సంబంధించిన ఆనందం కాదు.

**20-10-2002**

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 29-12-2002 | ఆదివారం | పూలపల్లి జడ్డు బ్రహ్మాజీగారి మిల్లు, ఆగర్రు రోడ్డులో |
| 05-01-2003 | ఆదివారం | లంకలకోడేరు, సొసైటీకాలేజ్ ఆవరణ |
| 21-01-2003 | మంగళవారం | మలికిపురం సాయిబాబా మందిరం |
| 26-01-2003 | ఆదివారం | జిన్నూరు రమణక్షేత్రం |

# రమణ భాస్కర పాఠకులకు

# నూతన సంవత్సర శుభాకాంక్షలు

# 2003




-ఎడిటర్



## లక్ష రుద్రాక్ష పూజ మహోత్సవం

ది॥ 30-11-2002తేదీ శనివారం జిన్నూరు గ్రామములో వేంచేసియున్న చెన్నమల్లేశ్వరస్వామివారి ఆలయంలో లక్షరుద్రాక్షపూజ కార్యక్రమము దేవస్థానం, మరియు భక్తుల సహకారంతో అత్యంత వైభవముగా జరుపబడినది. జిన్నూరు గ్రామంలో శివాలయం నందు జరిగిన పూజా కార్యక్రమమును, స్వామి వారి, అమ్మవారి విశేష అలంకరణను సద్గురు శ్రీ నాన్నగారు మరియు భక్తులు తిలకించినారు.






మురమళ్ళ గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరేశ్వర స్వామివారి దేవస్థాన ప్రాంగణంలో సద్గురు శ్రీ నాన్నగారు డిసెంబరు 3,4 తేదీలలో ప్రవచనం చేసినారు. మురమళ్ళ చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు ఈ జ్ఞానయజ్ఞమునకు అధిక సంఖ్యలో హాజరైనారు